క్లుప్తంగా

'కాంగ్రెస్‌తోనే రైతులకు న్యాయం'

మరికల్: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలంటే కాంగ్రెస్‌తో పార్టీతోనే సాధ్యమవుతుందని మండలం పార్టీ అధ్యక్షుడు వీరన్న, నాయకులు రామకృష్ణ, హరీష్‌లు అన్నారు. మరికల్‌లో వారు శనివారం విలేకర్లతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంట్ సరఫరా చేయడంలో విఫలమైందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల లేక కర్ణాటక రాష్ట్రంలో అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతురుణ మాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఏక కాలంలో రూ. 2 లక్షల రుణామాఫీ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ ఉంటుందన్నారు.

మార్మోగిన శివ నామస్మరణ

నారాయణపేట టౌన్ : పట్టణంలోని సింగార్ బేస్ కాలనీలో జంగిటి మల్లేష్ గురుస్వామి నివాసంలో శివపూజను మాలధారులు ఘనంగా నిర్వహించారు. శివ నామస్మరణ చేస్తూ లింగానికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక నైవేద్యం సమర్పించారు. మహామంగళ హారతినిచ్చి శివ స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాలాధారులు గౌరి శంకర్, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ నారాయణమ్మ భీమయ్య, జంగిటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధమండల దీక్ష ప్రారంభం



దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి లో వెలసిన వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో గురుస్వాముల ఆధ్వర్యంలో పలువురు శివభక్తులు అర్ధమండల దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణ సమక్షంలో అర్చకుడు శరణయ్యస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు దేశాయ్‌పల్లి గ్రామానికి చెందిన పద్మమ్మ, వెంకట్‌రెడ్డి, స్వప్న మధుసుదర్‌రెడ్డిలు అన్నదానం చేశారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

కృష్ణా: ఓటర్‌కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని తహసీల్దార్ సురేష్ అన్నారు. శనివారం బీఎల్‌ఓ, వీఆర్‌ఏల సమావేశంను నిర్వహించి మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశంను నిర్వహించినట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో మిగిలిపోయిన ఓటర్ల కార్డులకు ఆధార్‌లను అనుసంధానం చేయాలని సూచించారు. సమావేశంలో డీటీ మధన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద తొలగించాలని వినతి



నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని బహర్‌పేట, ధూల్‌పేట, కూరగాయల మార్కెట్ రోడ్, బాబా కాలనీ, శివాజీనగర్ తదితరచోట్ల కుక్కలు స్వైర విహారం చేస్తూ దాడులకు పాల్పడుతున్నాయని పట్టణ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యూసుఫ్ తాజ్ అన్నారు. వాటి బెడద తొలగించాలని శనివారం మున్సిపల్ కమిషనర్ సునీతకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల కుక్కలు దాడులు చేయడంతో చాలామంది ఆస్పత్రి పాలవుతున్నారని వివరించారు. తాజాగా 23 వార్డుకు చెందిన మహ్మద్ ఖాజా అనే విద్యార్థిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయని పేర్కొన్నారు. నాయకులు మహిమూద్ ఖురేషి, నరేష్, సీతారాంరెడ్డి, అహ్మద్, తఖీ, అప్పు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నారాయణపేట రూరల్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం డీఐఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రియాజ్‌హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలకు వస్తున్న బీద విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తామన్నారు. వార్షిక పరీక్షల్లో ప్రైవేటుకు దీటుగా మార్కులను సాధించే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ మద్దిలేటి, అబ్దుల్ ముజీబ్, ప్రతాప్‌రెడ్డి, అంబాజి, సుదర్శన్ రావు, సూపరింటెండెంట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కరాటేతో ఆత్మరక్షణ

- విద్యార్థినులకు శిక్షణ ప్రారంభం
- 140 పాఠశాలలను ఎంపిక చేసిన అధికారులు



కరాటేలో శిక్షణ ఇస్తున్న మాస్టర్

మరికల్: గల్లీ నుంచి ఢిల్లీ దాక ఎక్కడో ఒకచోట మహిళల పై యాసిడ్ దాడులు, అత్యాచారాలు, హత్యలు చేస్తూ సభ్యసమాజం తల్లదించుకునేలా చేస్తున్న మానవ మృగాలకు అడ్డుకట్ట వేయాలని, పాలకులు అందుకు చర్యలు తీసుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్య (కరాటే) నేర్పించాలని రాష్ట్ర విద్యాశాఖ మరోసారి నిర్ణయించింది. కరాటేలో శిక్షణ ఇవ్వడం వల్ల వారిలో ఆత్మస్థైర్యం నింపడంతో పాటు శారీరకంగా వారిని బలంగా ఉంచవచ్చని, చదువుపై ఏకాగ్రత ఉంటుందని భావించిన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాల్లో విద్యాశాఖ అధికారులు శిక్షణకు సంబంధించిన మొదటి విడత పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ మేరకు ఈ నెల 24 నుంచి శిక్షణ ప్రారంభమయ్యింది.

140 పాఠశాలలు ఎంపిక..

ఆకతాయిల నుంచి పొంచి ఉన్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులు కరాటే వంటి విద్యలను నేర్చుకోవడం కోసం ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మూడేళ్ల నుంచి వరుసగా ఎంపిక చేసిన పాఠశాలల్లో 3వేల మందికి పైగా విద్యార్థినులు శిక్షణ పొందారు. ఇందుల్లో భాగంగానే ఈ ఏడాది కూడా కరాటే, కుంగ్‌ఫూ వంటి యుద్ధ విద్యలను నేర్పించాలనే ఉద్దేశంతో జిల్లాలో పాఠశాలలను ఎంపిక చేశారు వాటిలో 73 ఉన్నత పాఠశాలలు, 56 ప్రాథమికోన్నత పాఠశాలలు, 11 కేజీబీవీలు ఉన్నాయి., ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు నిధులు కూడా విడుదల చేశారు. ఎంపిక చేసిన పాఠశాలలకు నెలకు రూ.5వేల చొప్పున శిక్షకులకు ఇవ్వనున్నారు. ఈనెల 24న జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల్లో శిక్షణ ప్రారంభమయ్యింది.

2500 మందికి శిక్షణ ఇచ్చా..



ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను చూసి నేను నేర్చుకున్న కరాటే, కుంగ్‌ఫూను నలుగురికి నేర్పించాలనే తపనతో 20ఏళ్ల నుంచి నారాయణపేట, మరికల్, ధన్వాడ, మక్తల్, ఆత్మకూర్, మహబూబ్‌నగర్‌లతో పాటు, కర్ణాటక రాష్ట్రంలోను విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నాను. ఇప్పటి వరకు 2500 మంది విద్యార్థినులకు ఉచితంగా శిక్షణ ఇచ్చాను. దీనివల్ల వారిలో ఆత్మ స్థైర్యం, ధైర్యం పెరుగుతుంది.
– గౌనిశ్రీను, మాస్టర్, ఎమ్మోనోనిపల్లి

విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలకు దగ్గరలో ఉండే మాస్టర్లను తీసుకుని కరాటేలో శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకున్నాం. పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా కరాటే శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు చేశాం. కరాటే శిక్షణ సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్‌లో సమాజంలో ధైర్యంగా ఉండవచ్చనే సంకల్పంతో శిక్షణ తరగతులను ప్రారంభించాం.
– గోవిందరాజులు, జిల్లా విద్యాశాఖ అధికారి

విద్యార్థుల హాజరు పెంచాలి

నర్వ: పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభమైన పద్ధతులలో బోధించాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సిములు అన్నారు. శనివారం పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలన్నారు. మనఊరు మనబడి పనులను సకాలంలో పూర్తి అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణా: ఏటా విద్యార్థులను విహారయాత్రలకు తీసుకెళ్లడం వల్ల వారిలో మేధాశక్తిని, ఆలోచన రీతిని, అంశాలను సులభంగా అర్థం చేసుకునే శక్తిని పెంపొందించవచ్చని చేగుంట క్షీరలింగేశ్వర ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం బస్వరాజ్ స్వామి అన్నారు. శనివారం తమ పాఠశాల విద్యార్థులను హైదరాబాద్‌లోని పలు సందర్శన స్థలాలకు తీసుకెళ్లినట్లు వివరించారు.



పెద్దకడ్మూర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

మరికల్: వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. మరికల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మిక సమస్యలపై ఫిబ్రవరి 1న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్రంలో చాలామంది కార్మికులు లేబర్ గుర్తింపు కార్డులు అందక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని వాపోయారు. కార్మికుడు సహజంగా మరణిస్తే రూ. 3 లక్షలు, డబుల్ ఇళ్లు ఇవ్వాలని, ప్రమాదంలో మరణిస్తే రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నా జయప్రదం చేసేందుకు కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. చిన్నబాలు, నాగేశ్వర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ఆరోగ్యం

కృష్ణా: ప్రతి వ్యక్తి నిత్యజీవితంలో ధ్యానం చేయడం వల్ల జ్ఞాపకశక్తి, ఆత్మస్థైర్యం పెరగడంతో పాటు మానసిక ఆరోగ్యం పొందవచ్చని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి, ధ్యాన ప్రచారకర్త అమ్మపల్లి బాలకృష్ణారెడ్డిలు అన్నారు. మండలంలోని గుడెబల్లూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులకు శనివారం ధ్యానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, కుర్షిదబేగం, శ్రీనివాస్‌రావ్, అర్జున్, స్వరూప, కల్యాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయరెడ్డి

వైభవంగా రథసప్తమి వేడుకలు



సూర్య నమస్కారాలు చేస్తున్న రామాలయం శిశు మందిర్ విద్యార్థులు



హారతి ఇస్తున్న మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని సాయి విజయ్ కాలనీలో వెలసిన శ్రీ సాయి హనుమాన్ మందిరం ఆలయ ప్రతిష్ఠాపన 11వ వార్షికోత్సవం, రథసప్తమి వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ఆలయ అర్చకులు ధూని పూజ, గణపతి పూజ, బాబాకు క్షీరాభిషేకం, పుష్పాభిషేకం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరై బాబాను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమం ప్రారంభించారు. సుదర్శన్‌రెడ్డి, సతీష్, జయంత్ రెడ్డి, సుభాష్, సేవాదళ్ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

➡ జిల్లా కేంద్రంలోని రథ సప్తమిని పురస్కరించుకుని సరస్వతీ శిశు మందిరం ఉన్నత పాఠశాల, ధూల్‌పేట, రామాలయం, అశోక్‌నగర్ శిశు మందిరంలో విద్యార్థులు, ఆచార్య బృందం సూర్య నమస్కారాలు చేశారు. పాఠశాల కమిటీ సభ్యులు, ప్రధానాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న కుతుబ్

అమరచింత: నిరుద్యోగ భృతికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం నాయకులతో కలిసి సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పెట్టిన రైతు రుణమాఫీ, డబుల్ బెడ్రూంలు,ద ళితులకు మూడెకరాలు, ఇంటికో ఉద్యోగం అంటూ ప్రజలను మోసం చేసిన సీఎం కేసీఆర్ పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. నిరుద్యోగులకు నెలకు ఇస్తానన్న రూ.3106 నిరుద్యోగ భృతికి మాత్రం నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో ప్రతాప్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


నర్వ: రైతుల ఏకకాల రుణ పరిష్కారానికి ఈ నెల చివరితో గడువు ముగియనున్నట్లు సింగిల్ విండో చైర్మెన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలో డీసీసీబీ ద్వారా రుణాలు తీసుకున్న రైతులు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వారు వెంటనే ఈ ఏకకాల రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండలంలోని పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల రైతులు ఇప్పటివరకు ఏకకాల రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని డీసీసీబీకి రుణాలను చెల్లించారని మిగిలిన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించికోవాలన్నారు. ఈ నెల 31 చివరి గడువని రైతులు గమనించాలన్నారు.

డైరీ ఆవిష్కరణ



నారాయణపేట: జిల్లా ఎంపీడీఓల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర డైరీని శనివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వనజ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జ్యోతి, సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షులు వెంకటయ్య, ఎంపీడీఓలు, జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహం లభ్యం



నర్వ: మండలంలోని రాంపురం గేట్ వద్ద శనివారం ఆంజనేయస్వామి పురాతన విగ్రహం బయటపడిన సంఘటన చోటుచేసుకుంది. యువకులు, ఆటో డ్రైవర్లు పరిసరాలను శుభ్రం చేస్తుండగా ఘటన చోటుచేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో రాంపురం, లంకాల్, కుమార్‌లింగంపల్లి గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు.

ముగిసిన తాపీమేస్త్రీల శిక్షణ



మద్దూరు: మండల కేంద్రంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(ఎన్‌ఏసీ) ఆధ్వర్యంలో 15 రోజుల పాటు తాపీ మేస్త్రీలకు ఇచ్చిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కార్మిక శాఖ అధికారి వెంకటయ్య, ట్రైనింగ్ అధికారి సత్యనారాయణలు కార్మికులకు, మహిళా కూలీలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకొని మీ పనిలో నైపుణ్యం పెంపొందించుకోవాలని విశ్రాంత ఎంఈఓ రాంరెడ్డి సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణ, ఆశమ్మ, 28 మంది శిక్షణ పొందిన కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మద్దూరు: హాత్ సే హాత్ జోడో యాత్ర సన్నాహక సమావేశానికి వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో నాయకులు చంద్రప్ప ఆధ్వర్యంలో ఖాజీపూర్‌కి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రఘు, గోవిందు, బోయిని వెంకటప్ప, హన్మంతు, మధు, నర్సింహులు, గౌస్, ఇస్మాయిల్, ఖాజా, మహిపాల్, పెంటప్ప ఉన్నారు.



బీటీ రోడ్డు సౌకర్యం కల్పించండి



అచ్చంపేట్- పెగడబండ రహదారి ఇలా..

మాగనూర్: మండలంలోని అచ్చంపేట్, పెగడబండ గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. దశాబ్దాల కాలంగా ఉన్న మట్టి రోడ్లను బీటీలుగా మార్చకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో వివిధ పనుల నిమిత్తం ప్రజలు మాగనూర్ మండల కేంద్రానికి వస్తుంటారు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కనీసం ఆటోలు కూడా రావడం లేదని వాపోతున్నారు. వర్ష కాలం వస్తే దారంతా బురదమయంగా మారి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీరోడ్డు వేయాలని కోరుతున్నారు.

అసంపూర్తి పనులతో ఇబ్బందులు

మాగనూర్: మండల కేంద్రం మీదుగా ఉన్న ఎన్‌హెచ్-167 రహదారిని గ్రామం వరకు నాలుగు లైన్లుగా మారుస్తూ కొన్ని రోజులు పనులు కొనసాగిస్తున్నారు. కాగా అసంపూర్తి పనులతో గ్రామ ప్రజలు, వాహనాదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వెళ్లే రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణం మధ్యలోనే నిలిపివేయడంతో చుట్టూ పక్కల ఇళ్ల నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు మురుగునీటి వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



ఎన్‌హెచ్-167పై పారుతున్న మురుగునీరు

పరేడ్‌తో శారీరక దృఢత్వం

నారాయణపేట రూరల్ : పోలీసులకు ఆరోగ్యం ఎంతో ముఖ్యమైందని, అందుకు ప్రతి ఒక్కరు వీక్లీ పరేడ్‌లో భాగస్వాములు కావాలని ఆర్‌ఐ రాఘవరావు అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులకు వీక్లీ పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాల గురించి అవగాహన కల్పించారు. అలాగే నీట్ టర్న్ అవుట్ కల్గి ఉండాలన్నారు. సమయపాలన, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. సర్వీసులో ఏమైనా సమస్యలు ఉంటే ఎస్పీని కలిసి పరిష్కరించుకోవాలన్నారు. ఆర్‌ఐ కృష్ణయ్య, ఇందిర, ఎస్‌ఐలు శ్రీనివాస్‌రావు, వసంత, సుధామాదురి, రిజర్వుడ్ పోలీసులు పాల్గొన్నారు.



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

రైతువేదికలో ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న రైతులు, అధికారులు



ఏర్పాటు చేసిన వివిధ రకాల వంటకాలు

నారాయణపేట రూరల్ : ఐక్యరాజ్య సమితి 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో శనివారం మండలంలోని జాజాపూర్ రైతువేదికలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీఏఓ జాన్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కొర్రవెజ్‌బిర్యానీ, రాగి డ్రై ఫ్రూట్స్ లడ్డూ, రాగి సూప్, సజ్జ రొట్టెలు, రాగి హల్వా, జొన్న రొట్టెలు, రాగి బిస్కెట్స్, నూడుల్స్, రాగి దోష, రాగి అంబలి, సామాల ఉక్మ వంటివి వంటకాలను ఏర్పాటుచేశారు. ఏఈఓ ప్రశాంతి, రైతుబంధు కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రభాకర్, ఏఓలు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు



బాలకార్మికులతో ఆపరేషన్ స్మైల్ బృందం

మాగనూర్: మక్తల్, మాగనూర్, ఉట్కూర్ మండలలో శనివారం ఆపరేషన్ స్మైల్ బృందం దాడులు నిర్వహించి 15 మంది బాలకార్మికులను గుర్తించింది. వీరంతా హోటళ్లు, కిరాణా షాప్‌లు, వెల్డింగ్ దుకాణాలలో, గృహ నిర్మాణ పనులలో పనిచేస్తున్నారని బృందం సభ్యులు పేర్కొన్నారు. బాలురను సీడబ్ల్యూసీకి అప్పగించామన్నారు. తదుపరి పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తారని తెలిపారు. బాలలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలకార్మికులు ఎకడైనా కనబడితే వెంటనే డయల్100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

'మళ్లీ నరేందర్‌రెడ్డికే పట్టం'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మద్దూరు: తమ లాంటి గ్రామస్థాయి నాయకుల వల్లే రేవంత్‌రెడ్డి 2004లో కొడంగల్‌లో ఎమ్మెల్యేగా అతి కొద్ది రోజుల్లోనే గెలిచిన మాటా వాస్తవం కాదా అని కోస్గి ఏఎంసీ చైర్మన్ వీరారెడ్డి ప్రశ్నించారు. రేవంత్ కంటే ముందు కూడా సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీపీలుగా ఉన్నామని గుర్తుచేశారు. శనివారం మండల కేంద్రంలోని షాగార్డెన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. రేవంత్ పార్టీ మారాకే తాము మారామని అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్ర సన్నాహక సమావేశంలో రేవంత్‌రెడ్డి స్థానిక నాయకులపై, బీఆర్‌ఎస్ చేసిన విమర్శలపై స్పందించారు. మద్దూరులో గురుకుల కోసం స్థలం గ్రామస్తుల డబ్బులతో కొనుగోలు చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తున్నారని, ఈ సారి ఆయనకు మండలం నుంచి అత్యధిక మెజారిటీ వస్తుందని మండల పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. వెంకట్‌రాములుగౌడ్, బసిరెడ్డి, రాములు, రాజు, శివరాజ్, నర్సింములు, వెంకటయ్య పాల్గొన్నారు.

మన మరికల్ లో 7 సం॥ రాలుగా
గురుకుల నవోదయ కోచింగ్ సెంటర్
హాస్టల్ వసతి కలదు,
అనుభవము కల్గిన వారిచేత,
1st ఫిబ్రవరి నుండి కోచింగ్ ఇవ్వబడును.
పీస్ ఏంజల్స్ హై స్కూల్
మహబూబ్‌నగర్ రోడ్, మరికల్
సెల్: 9985880148, 9133050862
9963345094, 9553660137

అధికారమే లక్ష్యంగా..

అమరచింత: నిరంకుశ పాలన నుంచి మళ్లీ ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొచ్చేందుకు మరోమారు పార్టీ నాయకులు సైనికులుగా పని చేయాలని టీపీసీసీ సహాయ కార్యదర్శి కేశం నాగరాజ్‌గౌడ్, పేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. మిట్టనంది మళ్లలో శనివారం హాత్ సేహాత్ జోడో అభియాన్ యాత్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వైఫల్యాలు, కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 90100 76222
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 90100 68317
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com